న్యూఇయర్ పార్టీల పేరుతో హద్దు దాటొద్దు

మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి



మేడ్చల్‌రూరల్: న్యూఇయర్ పార్టీల పేరుతో ప్రజలు హద్దు మీరొద్దని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ హనుమాన్‌గౌడ్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. న్యూ ఇయర్ సందర్భంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పార్టీలు చేసుకునే వారు పరిమితులకు లోబడి ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని కోరారు. డిసెంబర్ 31న రాత్రి పెద్ద ఎత్తున తమ సిబ్బందిలో డ్రంకెన్ డ్రైవ్ చేపడుతున్నట్లు వివరించారు. ప్రమాదాలు జరిగే చోట ప్రత్యేక ఏర్పాట్లు, తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన కూడళ్లు, ఇతర ప్రదేశాల్లో ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఓఆర్‌ఆర్‌పై రాత్రి 10 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకు వాహనాలకు అనుమతి లేదని, ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారికి ఫ్లైట్ టికెట్ చూపిస్తే అనుమతిస్తామన్నారు. మద్యం మత్తులో విచ్చలవిడిగా తిరుగుతూ ఇతరులను ఇబ్బందులకు గురిచేసే వారు తప్పించుకునే పరిస్థితి లేదన్నారు. సీసీ కెమెరాల ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చలాన్లపై రాయితీ..

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవచ్చన్నారు. గతేడాదితో పోలిస్తే ప్రమాదాలు తగ్గాయని, కొత్త సంవత్సరంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను మరింత ఎక్కువ చేపడతామన్నారు. ప్రభుత్వం చలాన్లపై రాయితీ ఇచ్చిందని, చలాన్లు ఉన్న వాహనదారులు వాటిని చెల్లించి భారం తగ్గించుకోవాలని, ఈ నెల 30 వరకు జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఘట్‌కేసర్ మండలం కాచవానిసింగారం సర్వే నంబర్–66లోని ప్రభుత్వ భూమిని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. భూమి విస్తీర్ణం కబ్జాకు గురైందా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేయడం, గుడిసెలు వేసిన వారు ఉంటే వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సర్కారు భూమిలో బోర్డుల ఏర్పాటుతో పాటు ఫెన్సింగ్ వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ చారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు



కీసర: కీసర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని రైతుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం సొసైటీ పరిధిలోని 8 మంది రైతులకు రూ.45 లక్షల మేర మంజూరైన దీర్ఘకాలిక రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, సీఈఓ కృష్ణారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాయి గీతాశ్రమంలో సుదర్శన హోమం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సాయి గీతాశ్రమంలో గురువారం సాయిసహిత సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ ఉత్తరాధికారి కీర్తిమా ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదర్శన హోమంలో వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం అష్టలక్ష్మి హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: విద్యుత్ సరఫరాలో లోపాలను అధ్యాయనం చేసి సరఫరా చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో గురువారం విద్యుత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిరంతరం విద్యుత్ సరఫరా కోసం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో లోపాలను అధ్యాయనం చేసి సరఫరా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు డీఈలు సుభాష్, సుచిత్రనాథ్, ఏడిఈలు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జగదీష్‌గౌడ్, బద్దం పరుశురాంరెడ్డి, మేకల రాముయాదవ్, జీకే.హన్మంతరావు, పరమేష్, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

బోడుప్పల్: జేజీఆర్ ఉన్నత పాఠశాల నిర్వాహకులు గంగరాజు గురువారం మున్సిపల్ సిబ్బందికి నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైనందిన జీవితంలో పరిసరాల పరిశుభ్రతకు పారిశుద్ధ్య కార్మికులు చేసే సేవలు అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి విజయ్‌కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

చర్లపల్లి జైల్‌ను సందర్శించిన ట్రైనీ న్యాయమూర్తులు

కుషాయిగూడ: చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని గురువారం జిల్లా కోర్టు ట్రైనీ న్యాయమూర్తుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్‌రాయ్ జైల్‌లో రోజువారి కార్యకలాపాలను వారికి వివరించారు. జైలులోని అన్నపూర్ణ, సంజీవనిల పనితీరును తెలిపారు. జైలు పరిశ్రమలు, ఉత్పత్తులు, జైల్ పనితీరు, ఖైదీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంస్కరణలను వారు ప్రశంసించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రాం, జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు, హైదరాబాద్ రేంజ్ ఐజీ డి.శ్రీనివాస్, ఉప పర్యవేక్షణాధికారులు ఎం.కృష్ణమూర్తి, శశికాంత్, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

మౌలాలి: మౌలాలిలోని మోర్నీ మోడల్ స్కూల్‌లో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. మౌలాలికి చెందిన విద్యార్థి ముస్తాఖీమ్ ఖాన్ తయారు చేసిన చంద్రాయణ్ ప్రాజెక్టు ఆకట్టుకుంది.



మేడ్చల్‌లో దరఖాస్తు ఫారాలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



అన్నోజిగూడలో పరిశీలిస్తున్న సీడీఎంఏ కమిషనర్ హరిచందన



జవహర్‌నగర్‌లో దరఖాస్తులను తీసుకుంటున్న కమిషనర్ రామలింగం



జవహర్‌నగర్‌లో దరఖాస్తులను అందజేస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్

తొలిరోజు.. ప్రజాపాలనకు స్పందన

- పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్న ప్రజలు
- ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో ఏర్పాట్లు
- కార్యక్రమాన్ని పర్యవేక్షించిన అధికారులు

మేడ్చల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమానికి తొలిరోజు గురువారం పెద్దఎత్తున తరలివచ్చారు. మేడ్చల్ మున్సిపాలిటీలో 23 వార్డుల్లో వార్డుల సమావేశం ఏర్పాటు చేసి ఒక్కో వార్డులో మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. రేషన్ కార్డులు లేనివారు తెల్లకాగితంపై దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు ఫారాలను చాలమంది ఇళ్లకు తీసుకెళ్లారు. మేడ్చల్ పట్టణంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, గ్రామాల్లో ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ శైలజ పాల్గొని పర్యవేక్షించారు. మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, కాంగ్రెస్ నాయకులు దరఖాస్తు ఫారంలు అందజేశారు. మేడ్చల్ పట్టణంలో 3,619 దరఖాస్తులు, మండలంలోని ఇతర గ్రామాల్లో 850 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

పోచారం: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీడీఎంఏ కమిషనర్ హరిచందన అన్నారు. గురువారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, రాజీవ్ గృహకల్ప కాలనీల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను అర్హులైన అందరికీ అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. తొలిరోజు 18 కేంద్రాల నుంచి 1,339 దరఖాస్తులను స్వీకరించినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, నల్లవెల్లి లక్ష్మి, సింగిరెడ్డి సాయిరెడ్డి, బైర హిమ, బాలగోని వెంకటేశ్ గౌడ్, నర్రి ధనలక్ష్మి, ఆకిటి శైలజ, బెజ్జంకి హరిప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో ప్రజాపాలనను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

జవహర్‌నగర్‌లో 3,250 దరఖాస్తులు

జవహర్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ రామలింగం తెలిపారు. గురువారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కార్పొరేషన్ అంతా 3,250 దరఖాస్తులు స్వీకరించామని ఆయన తెలిపారు. మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, డీఈఈ మాధవచారి, మేనేజర్ ప్రభాకర్‌యాదవ్, కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో..

కీసర: అభయహస్తం కోసం ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని గురువారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ప్రారంభించారు. మొదటిరోజు 18 వార్డుల్లో కలిపి మొత్తం 733 అప్లికేషన్లు అందినట్లు కమిషనర్ రాజమల్లయ్య తెలిపారు. నాగారం మున్సిపాలిటీలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో గురువారం ప్రారంభించామని మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు.

కీసర మండలంలో..

రాంపల్లిదాయరలో 235 దరఖాస్తులు, భోగారంలో 419 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీఓ గ్యామనాయక్, తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో రసాభాస

మేడ్చల్‌రూరల్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో రసాభాసగా జరిగింది. కార్యక్రమాన్ని నీరుగార్చే విధంగా మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తున్నాడని కాంగ్రెస్ కౌన్సిలర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని, మల్లారెడ్డి మంత్రిగా ఉన్నాడనే భ్రమలో ఉన్న కమిషనర్‌ను సస్పెండ్ డిమాండ్ చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని 15 వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములు కార్యక్రమాన్ని ప్రారంభించగా వార్డులో కౌన్సిలర్లు ప్రారంభించారు. మున్సిపల్‌లో 7 వేల తెల్లరేషన్ కార్డుదారులు ఉండగా 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

కాచవానిసింగారంలో..

ఘట్‌కేసర్: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అన్నారు. కాచవానిసింగారంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, జెడ్పీ సీఈఓ దేవసహాయంతో కలిసి గురువారం ప్రారంభించారు. కాచవానిసింగారంలో 213, ఎదులాబాద్‌లో 253 దరఖాస్తులను స్వీకరించారు. వైస్ ఎంపీపీ జంగమ్మ, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ అరుణ, సర్పంచులు వెంకట్‌రెడ్డి, సురేశ్, ఉప సర్పంచులు లింగేశ్వర్‌రావు, గీత, పరమేశ్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌కుమార్, ఆర్ఐలు సాయిరాం, పద్మాచారి పాల్గొన్నారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి

పేదలు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. కమిషనర్ సాబేర్ అలీతో కలిసి మున్సిపాలిటీలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

శామీర్‌పేట్: అర్హులందరికీ పథకాలు అందుతాయని శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల ఎంపీడీఓలు వాణి, వత్సలదేవి అన్నారు. శామీర్‌పేట మండలంలోని యాడారం, తుర్కపల్లి, మూడుచింతలపల్లి మండలంలోని పోతారం, కేశ్వాపూర్ గ్రామాల్లో దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా 100 కుటుంబాలకు ఒకటి చొప్పున కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎంపీఓలు సునీత, మంగతాయారు, జూనియర అసిస్టెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్, కౌన్సిలర్లు



కాచవానిసింగారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



నాగారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్ తదితరులు



దరఖాస్తులను అందజేస్తున్న జవహర్‌నగర్ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



మేడ్చల్‌లో జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు



జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తున్న పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్

మేడ్చల్: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మేడ్చల్‌లో మండలం, పట్టణ కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో నాయకులు పార్టీ జెండాను ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ, జూనియర్, సీనియర్ నాయకులు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనే కాంగ్రెస్ లక్ష్యం

మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జెండావిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజాపాలనే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. దేశం కోసం పార్టీ చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

మేడ్చల్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ శ్రేణులు ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. మున్సిపల్ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కీసర మండల కేంద్రంలో..

కీసర: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రమైన కీసరలో కాంగ్రెస్ పార్టీ నేతలు జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కీసర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడివిజయ్‌రెడ్డి, కీసర గ్రామశాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, నేతలు నల్లమధుసూదన్‌రెడ్డి, కందాడి సత్తిరెడ్డి, ముద్దం వెంకటేష్, ముద్దం మల్లేష్, తటాకం అభిలాష్, దయానంద్‌గౌడ్, కందాడి శివరాంరెడ్డి, చిక్కుడు రమేష్‌ముదిరాజ్, మొర్గు ముత్యాలు, గుర్రం లక్ష్మారెడ్డి, మచ్చాని పెద్ద జంగయ్యయాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్, ఘనాపూర్‌లో..

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఘనాపూర్, ఘట్‌కేసర్, అవుషాపూర్‌లో కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, వామన్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఘనాపూర్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షుడు సత్తిరెడ్డి, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

శామీర్‌పేట్: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింలుయాదవ్ అన్నారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మూడుచింతలపల్లి మండలకేంద్రంలో గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.



గుండ్లపోచంపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



ఘట్‌కేసర్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న ముత్యాలుయాదవ్




మూడుచింతలపల్లిలో కాంగ్రెస్ జెండావిష్కరణలో..

అరుంధతినగర్ సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతినగర్ బస్తీలో నిరుపేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ అరుంధతినగర్ ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ మాట్లాడుతూ.. అరుంధతినగర్‌లో 40 కుటుంబాలు గుడిసెలు వేసుకొని బతుకుతున్నారని, వారికి సొంత స్థలాలు, సొంత ఇళ్లు లేనందున గుడిసెలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వారికి తగిన న్యాయం చేయాలని వారు ఆయనను కోరారు. కార్యక్రమంలో మాదిగ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుల భాగ్యలక్ష్మీ, కొత్త అజయ్, కొత్త నరేష్, ధనమ్మ, నర్మద, మంజుల, ప్రమీలమ్మ, మహ్మద్ రజీయా బేగం, పుష్పలత, రేవతి, మేరీ, స్వరూప, పవన్‌కళ్యాణ్, జగన్, శివ, రాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అరుంధతినగర్ ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎర్రచందనం స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు

మేడ్చల్‌రూరల్: కొబ్బరిబొండాల చాటున అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న లారీ మేడ్చల్‌లో ఎస్ఓటీ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్న విషయం విధితమే.. కాగా లారీలో సుమారు రూ.50 లక్షల విలువ చేసే 3 టన్నుల ఎర్రచందనం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు నుంచి నాగపూర్‌కు ఎర్రచందనం దుంగలు తరలించేందుకు యూపీకి చెందిన లారీలో ఎవరికీ అనుమానం రాకుండా కొబ్బరి బొండాల లోడుతో వెళ్తున్నట్లు ప్లాన్ చేసి ఎర్రచంద్రనం దుంగలపై కొబ్బరి బొండాలు పెట్టి తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగురోడ్డు వద్ద లారీని పట్టుకుని తనిఖీలు నిర్వహించారు. ఎర్రచందనం దుంగలు లభ్యం కావడంతో డ్రైవర్ సత్యబాబ్, కర్నూలుకు చెందిన ఎర్రచందనం వ్యాపారి ప్రతాప్, యూపీకి చెందిన మరోవ్యక్తి హరిప్రకాష్ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు లారీ, ముగ్గురిని అప్పగించారు. లారీలో లభ్యమైన దుంగలను పరీక్షలు నిర్వహించి ఎర్రచందనంగా నిర్ధారించిన అటవీ అధికారులు సుమారు 3 టన్నుల ఎర్రచందనం దుంగలు లభ్యమయ్యాయని ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. దాని విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసి ముగ్గురుని కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

